క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

గోపాల్‌పేట: ప్రభుత్వం 65 శాతం సబ్సిడీతో అందించే జీలుగ విత్తనాలు ఆగ్రోరైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని గోపాల్‌పేట ఇన్‌చార్జ్ అగ్రికల్చర్ ఆఫీసర్ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 కిలోల బ్యాగు ధర రూ. 843 చెల్లించి జీలుగ విత్తనాలు పొందవచ్చన్నారు.
ఖిల్లాఘనపురం: మండలంలో వానాకాలంలో సాగు చేసుకునే వరి పంటలకు పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే జీలుగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి మల్లయ్య తెలిపారు. సోమవారం మండలానికి వచ్చిన జీలుగ విత్తనాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఏఆర్ఎస్‌కే 2, ఏఆర్ఎస్‌కే 3 రకాల జీలుగ విత్తనాలు ప్రస్తుతం సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఖిల్లాఘనపురం, సోళీపురం గ్రామాల్లో మొత్తం 78 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లిలో జమ్ములమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమంలో సోమవారం ఘనంగా జరిగింది. ప్రతిష్ఠోత్సవానికి దేవాలయ కమిటీ, భక్తుల ఆహ్వానం మేరకు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మాయిపల్లి ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని జూపల్లి పూజలు చేసినట్లు తెలిపారు. దేవాలయ కమిటీ సభ్యులు జూపల్లిని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పెబ్బేటి రాంచంద్రారెడ్డి, బీచుపల్లి యాదవ్, విద్యాసాగర్‌రావు, వడ్డెమాన్ బిచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

19న మండల సమావేశం

ఆత్మకూర్: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అధ్యక్షతన ఈనెల 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశంలో వైద్యం, వ్యవసాయం, విద్య, పౌరసరఫరాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఐసీడీఎస్, తాగునీరు, ఉపాధిహామీ, పశువైద్యం తదితర శాఖల అభివృద్ధిపై సమీక్ష కొనసాగుతుందన్నారు. సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయాశాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్



వనపర్తి: తన ఆటోలో ప్రయాణం చేసి డబ్బు, నగలు, ఫోన్ ఉన్న బ్యాగును మరిచిపోయిన జ్యోతి అనే మహిళకు బ్యాగును తిరిగి బాధితురాలికి ఇచ్చి ఆంజనేయులు అనే ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నారు. ఆర్టీసీ బస్‌లో హైదరాబాద్ నుంచి వనపర్తికి వచ్చిన మహిళ ఆటోలో టీచర్స్ కాలనీకి వెళ్లారు. తన బ్యాగును ఆటోలోనే మరిచిపోయి ఇంటికి వెళ్లిపోయారు. స్టాండ్‌కు వెళ్లిన తర్వాత తన ఆటోలో బ్యాగు ఉన్నట్లు గుర్తించిన ఆటో డ్రైవర్.. కానిస్టేబుల్‌కు సమాచారం ఇచ్చి ఆమె ఆటోస్టాండ్‌కు రప్పించి అందరి సమక్షంలో బ్యాగును అప్పగించారు. నిజాయితీని చాటుకున్న ఆటోడ్రైవర్‌కు కానిస్టేబుల్ నరసింహ, కొమ్ము శ్రీనివాసులు అభినందించారు.

బైక్, కారు ఢీ: ఇద్దరికి గాయాలు

పెబ్బేరు: బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రంగాపూర్ ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పైపాడు గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, అతడి భార్య మన్నెమ్మ బైక్‌పై పెబ్బేరుకు పని నిమిత్తం వెళ్తుండగా రంగాపూర్ సమీపంలో ఎన్‌హెచ్44పై హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారు బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న భార్యభర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులను సమాచారం అడుగగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

'పాటకు పట్టాభిషేకం' కరపత్రాల విడుదల

వనపర్తి టౌన్: పట్టణంలో ఈనెల 27, 28 తేదీల్లో జానపద కళాకారులు, కవులతో కవి సమ్మేళనం, పాటకు పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఎల్.మురళీధర్ తెలిపారు. సోమవారం స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తన నివాసంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. తెలంగాణ సాహితీ, ప్రజానాట్యమండలి, తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక స్పృహ కలిగిన పాటలు, కవిత్వాలు పాడేందుకు గాయకులు, కవులు ఈనెల 20వ తేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 94902 06137, 97011 41102, 80968 03393 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గంధం నాగరాజు, అధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి రాజారాంప్రకాశ్, ప్రచార కార్యదర్శి చీర్ల నాగేంద్రం, గాయకులు సత్తార్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్

- జిల్లా వ్యాప్తంగా సీఎం కప్ పోటీలు ప్రారంభం
- ఉత్సాహంగా పాల్గొన్న యువత
- గ్రామాల్లో ముమ్మరంగా అవగాహన కల్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



అమరచింతలో రన్నింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అమరచింత: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టిందని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, తహసీల్దార్ చాంద్‌పాషా కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంపీడీఓ జ్యోతి, కమిషనర్ మహమ్మద్ ఖాజా, ఎంఈఓ భాస్కర్‌సింగ్‌తో కలిసి వారు ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ 15 నుంచి 36 ఏళ్ల వయసు గల వారు చెడు వ్యవసనాలకు గురి కాకుండా క్రీడలపై ఆసక్తి చూపి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు.
పాన్‌గల్: మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇలాంటి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి, ఎస్ఐ నాగన్న, ఎంపీఓ రఘురాములు, సర్పంచ్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
వీపనగండ్ల: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడమే కాక స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎంపీపీ కమలేశ్వర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, ఎస్ఐ రామన్‌గౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
కొత్తకోట రూరల్: వేసవిలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి చూపాలని పెద్దమందడి తహసీల్దార్ సంధ్య, ఎస్ఐ హరిప్రసాద్, ఎంపీడీఓ అఫ్జల్, ఫిజికల్ డైరెక్టర్ కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ మైదానంలో చీఫ్‌మినిస్టర్ కప్ ఆటల పోటీలను అధికారులు ప్రారంభించారు. ఈ పోటీల్లో 46మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు ఫిజికల్ డైరెక్టర్ కుమార్ తెలిపారు. మంగళవారం కబడ్డీ, అథ్లెటిక్స్, రన్నింగ్ పోటీలను నిర్వహించడంతో పాటు మద్దిగట్ల, చిన్నమందడి జట్లకు వాలీబాల్ పోటీలను నిర్వహించి సోమవారం గెలుపొందిన పెద్దమందడి జట్టుతో ఆడిస్తామని పేర్కొన్నారు.
మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్ క్రీడా పోటీలను సోమవారం తహసీల్దార్ నరేందర్ ప్రారంభించారు. అంతకు ముందు ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.
గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సీఎం కప్ ఆటల పోటీలను ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీను, వైస్ ఎంపీపీ శేఖర్, నాయకులు కోటిరెడ్డి, కోదండం, ఎంపీడీఓ ఉసేనప్ప, తహసీల్దార్ సునీత తదితరులు పాల్గొన్నారు.
పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాపోటీలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ వినీలారాణి, కోఆప్షన్ సభ్యులు ఆరీఫ్, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, హెచ్ఎం కురుమయ్య, ఎస్ఐ కేటీ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



వీపనగండ్లలో..



మదనాపురంలో..



గోపాల్‌పేటలో..



పెద్దమందడి జెడ్పీహెచ్ఎస్ గ్రౌండ్‌లో..



పాన్‌గల్‌లో..

'ప్రజావాణి'లో కలెక్టర్ తల్లిదండ్రులు



ఉన్నత శిఖరాలను అధిరోహించిన తమ కుమారుడి పనితీరును స్వయంగా చూసేందుకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తల్లిదండ్రులు వీణా, నంద్‌లాల్ పవార్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి సోమవారం వచ్చారు. సమావేశ మందిరంలో సామాన్య ప్రజలతో పాటుగా చివరన కూర్చొని తిలకించారు. వారు కలెక్టర్ తల్లిదండ్రులనే విషయం అక్కడ కూర్చొన్న అధికారులకు సైతం తెలియకపోవటం గమనార్హం. - వనపర్తి

క్రీడా సామగ్రి అందజేత

ఆత్మకూర్: స్థానిక మినీస్టేడియంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న క్రీడాకారులకు పట్టణానికి చెందిన ప్రముఖ వాస్తుప్లానర్ రమాకాంత్ రూ.5 వేలతో క్రీడా సామగ్రిని అందజేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని, క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని కోరారు. కోచ్‌లు ఖాదర్, శ్రీకాంత్, సిరాజ్, నరేందర్, బాలు, మురళి, నర్సింహ, దివాకర్, కిషోర్, డాక్టర్ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

'మాదాసి కుర్వలకు ఎస్సీ సర్టిఫికేట్ ఇవ్వొద్దు'

అమరచింత: రాష్ట్రంలోని మాదాసి కుర్వలకు ఎస్సీ కుల ధ్రువీకరణ సర్టిఫికేట్ ఇవ్వొద్దని, వారు ఆర్థికంగా బలంగా ఉన్నారని ఎస్సీ సామాజిక వర్గ యువకులు తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఎస్సీలు అయిన మాల, మాదిగ, బుడగజంగాలు, హోలీయ దాసరులు ఊరికి దూరంగా జీవిస్తూ ఇప్పటికీ అంటరానితనాన్ని అనుభవిస్తున్నారని వాపోయారు. ఎస్సీ సర్టిఫికేట్లు కావాలని డిమాండ్ చేస్తున్న మాదాసి కుర్వలకు అలా అడిగే హక్కు లేదన్నారు. దీనిపై తహసీల్దార్ చాంద్‌పాషా మాట్లాడుతూ ఈ విషయాన్ని కలెక్టర్‌కు విన్నవిస్తామన్నారు. కార్యక్రమంలో శేఖర్, సూరి, మాల సూరిబాబు, సునీల్, కార్తీక్, సురేందర్, శ్యామ్ సుమన్, వినీత్, అజయ్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దాతలు, నాయకులు

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన శ్రీ రామలింగేశ్వర స్వామి విగ్రహ, నవగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలు పాడిపంటలు, సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగులు బిల్లా సురేందర్‌రెడ్డి, గోపాల్‌రావు దాతల తోడ్పాటుతో విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించడం అభినందించదగిన విషయం అన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌నాయక్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, సర్పంచ్ అశోక్‌రెడ్డి, దాతలు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రి హయాంలోనే అభివృద్ధి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్.. పాల్గొన్న నాయకులు

వనపర్తి: దశాబ్దాల పాటు వనపర్తి నియోజకవర్గాన్ని పాలించిన ఏ నాయకుడు చేయని అభివృద్ధిని మంత్రి నిరంజన్‌రెడ్డి నాలుగున్నర ఏళ్లలో చేసి చూపించారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని మంత్రి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రిని విమర్శించే అర్హత మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డికి లేదన్నారు. పార్టీకి కాదు.. పదవులకు రాజీనామా చేసి తిరిగి గెలిచి మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో ఉద్యమకారులను పోలీసులతో కొట్టించిన ఘనత మాజీ మంత్రి జూపల్లికే దక్కిందన్నారు. 2014లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాదని ముందుగానే పసిగట్టు బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్ హవాతో గెలిచి మంత్రి పదవి అనుభవించారన్నారు. గత ఎన్నికల్లో ఓడిపోగానే.. పార్టీని విభేదించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఖమ్మం అభివృద్ధిని విడిచి వనపర్తి రాజకీయాల్లో జోక్యం చేసుకోవటం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి తగదన్నారు. వనపర్తి జిల్లాగా అప్‌గ్రేడ్, వ్యవసాయం, విద్యారంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత నిరంజన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, నాయకులు బి.లక్ష్మయ్య మాణిక్యం, జోహెబ్, కోళ్ల వెంకటేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సమరశీల పోరుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న నాగరాజు

పాన్‌గల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ఉన్న లిటిల్‌స్టార్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి నాయకత్వ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో 'జాతీయోద్యమంలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై ఆయన మాట్లాడారు. బ్రిటీష్ పాలకుల చెరలో మగ్గుతున్న భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని.. బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పనకు జరిగిన భారత జాతీయోద్యమంలో విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, సహాయ కార్యదర్శి రాఘవ, వినోద్, క్రాంతి, విల్సన్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు 2,681 మంది విద్యార్థులు



మాట్లాడుతున్న పాలీసెట్ కన్వీనర్ చంద్రశేఖర్

వనపర్తి టౌన్: పాలీసెట్ ప్రవేశ పరీక్షను జిల్లా వ్యాప్తంగా 12 కేంద్రాల్లో బుధవారం నిర్వహిస్తున్నట్లు పాలీసెట్ కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. 2,681 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర పరికరాలు తీసుకురావద్దని సూచించారు. ఈ మేరకు సోమవారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, జాయింట్ సూపరింటెండెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవేశ పరీక్షల నిర్వహణకు 12 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 12 మంది జాయింట్ సూపరింటెండెంట్లు, 107 మంది ఇన్విజిలేటర్లను నియమించడంతో పాటుగా రిజర్వులో మరో 55 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారు. ఇన్విజిలేటర్లు ఫోన్లు పరీక్ష కేంద్రంలోకి తీసుకురావద్దని ఆదేశించారు. విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని పరీక్ష కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

వీపనగండ్ల: మామిడి, ఆయిల్‌పాం, మునగ తోటల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీని పొందేందుకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని వీపనగండ్ల సర్పంచ్ నర్సింహారెడ్డి కోరారు. ఒక రైతు కుటుంబంలో భార్య, భర్త, కుమారులకు కలిపి 5 ఎకరాల పొలం మాత్రమే ఉన్న రైతులు ఈ తోటల పెంపకానికి అర్హులని, నీటి వసతి కోసం ఖచ్చితంగా బావి, బోరు ఉండాలన్నారు. అర్హులు జాబ్‌కార్డు నెంబర్, ఆర్ఓఆర్, పట్టాదార్ పాస్‌పుస్తకం, బ్యాంక్ ఖాతా జిరాక్స్ కాపీలను తీసుకుని 17వ తేదీ వరకు పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు సన్మానం



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలోని లిటిల్ స్టార్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన జతిన్, 9 జీపీఏ నుంచి 9.8 జీపీఏ సాధించిన పది మంది విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ ప్రతిభ చూపిన విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా చదువుతూ ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. మంచి సమాజం నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చదివిన పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శేఖర్‌యాదవ్, కరస్పాండెంట్ ఆంజనేయులు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీఓఏల ధర్నా

మదనాపురం: స్థానిక మహిళా సమైక్య కార్యాలయం ఎదుట ఐకేపీ వీఓఏలు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ వీఓఏలు తమ సమస్యల పరిష్కారం కోరుతూ 29 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా మొండిగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కనీస వేతనం రూ.26వేలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏపీఎం కృష్ణవేణికి అందజేశారు. కార్యక్రమంలో అలివేల, జయమ్మ, శ్రీలత, అరుణ, శ్రీమణి, పద్మ, సంధ్య, నారాయణ, ముని కుమార్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

వనపర్తి: స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్ వైజర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆస్పత్రిలో ఆయన కార్మికులతో కలిసి మాట్లాడారు. 2022 ఆగస్టు నుంచి వేతనాలు రావటం లేదని, సమస్యను ఇది వరకే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆయన ఆదేశించినా.. ఏజెన్సీ నిర్వాహకులు స్పందించటం లేదని అసహనవ వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు ఇవ్వకుంటే మంత్రి నిరంజన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరసింహ, శ్రీను, బాలరాజ్, రాజేష్, దర్గా స్వామి, అనిల్, శ్రీకాంత్, ఉదయ్ కుమార్, కళ్యాణ్ పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాజాప్రకాష్‌రెడ్డి

కొత్తకోట రూరల్: రైతులు పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని పెద్దమందడి రైతుబంధు అధ్యక్షుడు రాజాప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన సమస్యలను ఆడిగి తెలుసుకోవడంతో పాటు ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడాల్సి అవసరం లేదన్నారు. రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయిస్తే నష్టపోతారని, ప్రభుత్వానికి అమ్మితే మంచి ధర వస్తుండటంతో పాటు వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని వివరించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: పట్టణంలో త్వరలో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ముందస్తు సమీక్షలు అవసరమని, పట్టణ ప్రజల అభీష్టం మేరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, ప్రముఖ సిద్ధాంతి గోపాలకృష్ణ తెలిపారు. భక్త మార్కండేయ ఆలయ ఆవరణలో సోమవారం బొడ్రాయి ప్రతిష్ఠపనకు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. పట్టణంలో ప్రాథమికంగా 9 బొడ్రాళ్లతో యంత్రం, మంత్రం, తంత్రంతో అష్టదిగ్బంధం చేయాలన్నారు. దీనికోసం పట్టణ శివారు ప్రాంతాలను గుర్తించి అన్ని వర్గాల కుల పెద్దలతో చర్చించారు. త్వరలోనే బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల తేదీలను ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో నాగభుషణంగౌడ్, రమేష్, వెంకట్‌రెడ్డి, భాస్కర్, రఘు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నాగరాజ్‌గౌడ్

అమరచింత: గ్రామాల్లో ప్రజలు నిత్యం సమస్యలతో సతమతమవుతున్నా.. పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు మొద్దు నిద్రపోతున్నారని టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ ఆరోపించారు. మండలంలోని చంద్రగఢ్‌లో సోమవారం ఆయన పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు విద్యుత్ సమస్య వేధిస్తున్నా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. దీంతో సంబంధిత ట్రాన్స్‌కో ఏఈతో మాట్లాడుతూ విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పర్యటక, చారిత్రక గ్రామమైన చంద్రగఢ్‌లో కోటను పర్యటక ప్రాంతంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించక పోవడం శోచనీయం అన్నారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమని చంద్రగఢ్‌కు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్ ఖాన్, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, తమ్మిరెడ్డి, ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా సీసీ రోడ్ల శాంపిళ్ల సేకరణ



సీసీ రహదారి శాంపిల్స్ తీసుకుంటున్న క్వాలిటీ కంట్రోల్ టీం సభ్యులు

అమరచింత: పట్టణంలో సుమారు రూ.3.5కోట్లతో నిర్మించిన సీసీ రహదారుల నాణ్యతను పరిశీలించడానికి వచ్చిన అధికారులు సైతం నామమాత్రంగా పరిశీలనలు చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో సోమవారం క్వాలిటీ కంట్రోల్ విభాగానికి సంబంధించి ఏఈ ఆధ్వర్యంలో సీసీ రహదారుల శాంపిళ్లు సేకరించారు. ఎవరికీ చెప్పపెట్టకుండా వచ్చి షాంపిల్స్‌ను సేకరించాల్సిన క్వాలిటీ కంట్రోల్ అధికారి రహదారిని నిర్మించిన కాంట్రాక్టర్‌తో కలిసి శాపింల్స్ సేకరించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రహదారుల నిర్మాణంలో ప్రధాన బీటీ రహదారికి సమీపంలో మెటీరియల్ అధికంగా వేసి నిర్మించిన ప్రాంతాల్లో శాంపిళ్లు తీయడం దారుణమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన సీసీ రహదారులను పూర్తి స్థాయిలో పరిశీలించి నాణ్యమైన రోడ్లను నిర్మించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

'నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం వద్దు'

అమరచింత: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నాయని, ఉద్యోగ భర్తీ చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కుతుబ్ అన్నారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో సీపీఐ పాదయాత్ర కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తవుతున్నా.. ఇప్పటికి వరకు ఇచ్చిన హామీలను అమలు చేయట్లేదని దుయ్యబట్టారు. కర్ణాటక రాష్ట్ర ప్రజలు కేంద్ర ప్రభుత్వ కుట్రలను గుర్తించి అక్కడి బీజేపీకి ఘోరీ కట్టారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మల్లేష్, వెంకటేష్, అంజన్న, కిష్టయ్య పాల్గొన్నారు.